సాక్షి విశాఖపట్నం

మంగళవారం ၊ 9 ၊ సెప్టెంబర్ ၊ 2025



పౌర్ణమి కారణంగా సముద్రంలో ఆటుపోట్లు పెరగడంతో అలలు ముందుకు చొచ్చుకొచ్చాయి. సోమవారం సాయంత్రం అలలు రక్షణ గోడను తాకడంతో పాటు, ఇసుక తిన్నెలపై ఉన్న బడ్డీ దుకాణదారులకు ఇబ్బందులు కలిగాయి.
-ఫొటో : సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



విజువల్ వండర్ 'మిరాయ్' 8లో

న్యూస్‌రీల్

తీరంలో మహిళల వరల్డ్ కప్ ట్రోఫీ సందడి



ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ట్రోఫీతో ఫొటోలకు ఫోజులిస్తున్న నగర యువత

విశాఖ స్పోర్ట్స్: వుమెన్ క్రికెట్ వరల్డ్ కప్ సందడి విశాఖలో నెలకొంది. ఈ నెల 30 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో భాగంగా ఆతిథ్య జట్టుకు బాగా అచ్చివచ్చిన నగరంలోని వైఎస్సార్ స్టేడియం వేదికగా ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వరల్డ్‌కప్ విజేతలకు అందించే ట్రోఫీ విశాఖలో సందడి చేస్తోంది. బీచ్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం అభిమానుల కోసం ట్రోఫీతో ర్యాలీ చేశారు. సాగరతీరంలోని 'ఐ లవ్ వైజాగ్'వద్ద ట్రోఫీతో అభిమానులు సెల్ఫీలు తీసుకుని, ఆనందం పొందారు.

పర్యాటకానికి వన్నెతెచ్చేందుకు వియత్నాంతో ఒప్పందం



వియత్నాం ప్రతినిధులతో ఏపీ సీఎస్ అజయ్ జైన్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వియత్నాంతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్ చౌ ట్రీ యంగ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం బౌద్ధమతానికి సంబంధించిన ప్రాంతాలైన అమరావతిలోని కాలచక్ర, ఉమ్మడి విశాఖలోని బొజ్జన్నకొండ, బావికొండ, తొట్లకొండలను సందర్శించేందుకు వియత్నాం పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్, ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక రేపు

మద్దిలపాలెం: కర్నూల్ జిల్లాలో ఈ నెల 14న జరిగే అంతర్ జిల్లా 12 ఏళ్లలోపు బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో విశాఖ జిల్లా నుంచి పాల్గొనే జట్టు ఎంపికకోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రాజారావు సోమవారం తెలిపారు. ఆసక్తిగలవారు సాలిగ్రామపురం పోర్ట్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 10న సాయంత్రం 4 గంటలకు కోచ్ సురేష్‌కుమార్ వద్ద హాజరుకావాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 24 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

సింహగిరిపై నేటి నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరణ



సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించనున్నారు. ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాలు, ఈనెల 7వ తేదీ చంద్రగ్రహణం, 8వ గ్రహణ సంప్రోక్షణ పూజలు కారణంగా ఆర్జిత సేవలన్నీ రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరిగి మంగళవారం నుంచి యథావిధిగా నిత్యకల్యాణంతో పాటు ఆర్జిత సేవలన్నీ పునరుద్ధరించనున్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా జరుగుతాయని పేర్కొన్నారు. ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

కళా ఉత్సవ్ పోటీలకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి డైట్ వద్ద ఈ నెల 11, 12 తేదీల్లో జరుగనున్న కళా ఉత్సవ్ పోటీలకు విద్యార్థులకు ఆహ్వానిస్తున్నట్టు డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ సోమవారం తెలిపారు. ఉమ్మడి విశాఖలోని స్కూళ్లు, కాలేజీల విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు https://forms.gle/J8Kxw1p5ETh9iU18A అనే గూగుల్ ఫారం ద్వారా లేదా నేరుగా డైట్‌కు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 90303 83736, 90009 92709, 94414 65299 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

కులాల బార్లూ కూటమి నేతలకే!



- 9 బార్లకు 4 చొప్పున దరఖాస్తులు
- మిగిలిన ఒక్క బారుకు 9 దరఖాస్తులు
- చక్రం తిప్పిన అధికార టీడీపీ ఎమ్మెల్యే
- అంతా కూటమి నేతల బార్ల యాజమాన్యాల కనుసన్నల్లోనే..
- లైసెన్స్ ఫీజు రాయితీ కోసం అడ్డదారులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కులాలకు కేటాయించిన బార్లపైనా కూటమి నేతలే వాలిపోతున్నారు. జిల్లాలో శెట్టి బలిజ, యాత కులాలకు మొత్తం 10 బార్లను కేటాయించారు. ఈ బార్లను కూడా కూటమి నేతలకు చెందిన మద్యం వ్యాపారులే తమ అనుచరులతో దరఖాస్తు చేసుకుని దక్కించుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 10 బార్లకుగాను 9 బార్లకు 4 చొప్పున దరఖాస్తులు రాగా.. మిగిలిన ఒక్క బారుకు మాత్రం 9 దరఖాస్తులు వచ్చాయి. 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ వేస్తామన్న నిబంధనల నేపథ్యంలోనే 9 బార్లకు పక్కాగా 4 చొప్పున దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ 9 బార్లను కూడా నిజమైన శెట్టి బలిజ, యాత కులాలకు చెందిన వ్యాపారులకు కాకుండా... కూటమి నేతలకు చెందిన యజమానుల వద్ద ఉండే వారి పేరుతోనే దరఖాస్తు చేసుకుని దక్కించుకున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంలో గతంలో మద్యం సిండికేట్‌లో కీలకంగా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యే చక్రం తిప్పినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ బార్లతో పోలిస్తే ఈ బార్లకు లైసెన్స్ ఫీజులో ఏకంగా 50 శాతం మినహాయింపు ఉండటంతోనే వీటిపై కూటమి నేతల కన్ను పడింది.

రంగంలోకి రింగ్ మాస్టర్...!

వాస్తవానికి గతంలో మద్యం సిండికేట్‌లో కీలకంగా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యే... మొన్నటి ప్రైవేటు మద్యం షాపుల వ్యవహారంలో దూరంగా ఉన్నారనే ప్రచారం జరిగింది. అయితే బార్ల విషయానికి వచ్చేసరికి సాధారణ బార్లకు లైసెన్స్ ఫీజు ఏకంగా రూ.75 లక్షలతో పాటు తప్పనిసరిగా 4 దరఖాస్తులు చేయాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. దీంతో బార్ల యాజమాన్యాల్లో వ్యతిరేకత వచ్చింది. అయితే, కులాలకు కేటాయించిన బార్లకు మాత్రం లైసెన్స్ ఫీజు కేవలం 37.5 లక్షలు మాత్రమే. అంటే ఏకంగా 50 శాతం రాయితీ లభిస్తోంది. దీంతో సగానికి సగం లైసెన్స్ ఫీజులో మినహాయింపు లభిస్తుండటంతో సదరు మద్యం సిండికేట్‌లో కీలకంగా ఉన్న టీడీపీ ఎమ్మెల్యే చక్రం తిప్పారు. కూటమి నేతలకు చెందిన బార్ల యజమానుల వద్ద ఉండే వారితోనే మొత్తం వ్యవహారం నడిపించారు. తమ అనుయాయులతో దరఖాస్తులు చేయించి మొత్తం 9 బార్లను దక్కించుకున్నారు. ఈ వ్యవహారంలో సదరు టీడీపీ ఎమ్మెల్యేనే చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. తద్వారా శెట్టి బలిజ, యాత కులాల్లోని వ్యాపారస్తులకు దక్కాల్సిన బార్లు కాస్తా.. అధికారపార్టీకి చెందిన వ్యక్తుల చేతిలోకి వెళ్లిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మాజీ ఎక్సైజ్ అధికారికి కూడా...!

జిల్లాలో శెట్టి బలిజ, యాత కులాలకు కేటాయించిన బార్లలో 9 కూటమి నేతలకు దక్కాయి. ఇందులో విచిత్రంగా పదవీ విరమణ చేసిన ఎక్సైజ్ అధికారి కూడా ఉండటం గమనార్హం. సదరు ఎక్సైజ్ మాజీ అధికారికి మొదటి నుంచీ ఈ మద్యం సిండికేట్‌తో మంచి సంబంధాలు ఉన్నట్టు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన కూడా ఈ కులాల బార్లలో ఒకటి దక్కించుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు నగరంలో మంచి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం నడుస్తున్న రెండు బార్లకు చెందిన యాజమాన్యాలను కూడా దరఖాస్తు చేసుకోవద్దంటూ కూటమి నేతల నుంచి బెదిరింపులు వచ్చినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. తద్వారా ఆయా ప్రాంతాల్లో తాము బార్లను ఏర్పాటు చేసుకునేందుకు కూటమి నేతల కనుసన్నల్లో ఉండే ఒక మద్యం సిండికేట్ యజమాని పక్కా ప్లాన్ వేసుకున్నట్టు తెలుస్తోంది.

మైనారిటీలపై చిన్నచూపా?

- ఇమామ్, మౌజమ్‌లకు బకాయిలపడ్డ జీతాలు విడుదల చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ముస్లిం నేతల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, డాక్టర్ జహీర్ అహ్మద్, బర్కత్ అలీ, పార్టీ నేతలు

మహారాణిపేట: మైనారిటీ ముస్లింలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని, వారికి రాజకీయంగా, ఆర్థికంగా అండగా ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు 11 నెలలుగా బకాయిలపడ్డ జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు, 53వ వార్డు కార్పొరేటర్ భర్కత్ అలీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలు, పార్టీ నేతలతో కలిసి ఈ అంశంపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం కేకే రాజు మాట్లాడుతూ మైనారిటీ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత మహానేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిదే అన్నారు. మైనారిటీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలన్న వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఉన్నత పదవుల్లో సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ముస్లిం కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో మసీదులో పనిచేస్తున్న ఇమామ్‌లకు నెలకు రూ. 10,000, మౌజమ్‌లకు నెలకు రూ. 5,000 ప్రతి నెల ఇచ్చి వారికి ఆర్థిక భరోసా కల్పించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింల సంక్షేమాన్ని విస్మరించి, వారికి కల్పించాల్సిన కనీస సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. మైనారిటీలకు అండగా ఉండి ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా కవ్వింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, అలాగే 11 నెలలుగా బకాయిపడ్డ ఇమామ్‌లు, మౌజమ్‌ల జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుడు పేర్ల విజయ చందర్, పార్టీ నాయకులు అల్లంపల్లి రాజుబాబు, డాక్టర్ జహీర్ అహ్మద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ససపల రవీంద్ర భరత్ , దేవరకొండ మార్కెండేయులు, బోని శివరామకృష్ణ , కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, కో ఆప్షన్ సభ్యులు ఎం.డి షరీఫ్, మైనారిటీ నాయకులు కేవీ బాబా, షేక్ బాబ్జి, మక్బుల్, బిలాల్, మునీర్, సౌకత్ అలీ, మహ్మద్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు శాపంగా కూటమి పాలన

- మూగ బాలికపై లైంగిక దాడి దారుణం
- బాధిత బాలికకు న్యాయం చేయాలి
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి

సాక్షి, విశాఖపట్నం: కూటమి పాలన మహిళలకు శాపంగా మారిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆవేదన వ్యక్తం చేశారు. సీతమ్మధారలో మూగ మైనర్‌పై జరిగిన లైంగిక దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి పాలనలో మద్యం విచ్చలవిడిగా లభిస్తోందని, బెల్ట్ షాపులు పెరిగాయని ఆరోపించారు. మద్యం మత్తులో మహిళలపై హత్యలు, లైంగిక దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. కూటమి 15 నెలల పాలనలో మహిళలపై సగటున గంటకు 70 అఘాయిత్యాలు జరిగాయని అసెంబ్లీ సాక్షిగా హోంమంత్రి అనిత చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దిశ యాప్‌ను తొలగించి, శక్తి యాప్‌ను ప్రవేశపెట్టారని, అయితే దాని గురించి ప్రజలకు అవగాహన లేదని ఆమె పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు మహిళలకు ఎంతో రక్షణ కల్పించాయని గుర్తు చేశారు. హోంమంత్రి అనిత వెంటనే బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వైఎస్సార్ సీపీ మహిళా విభాగం తరఫున న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, కార్పొరేటర్లు శశికళ, పార్టీ మహిళా నాయకులు యరబిల్లి వరలక్ష్మి, నమ్మి లక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆందోళన

మహారాణిపేట : సదరం సర్టిఫికెట్లలో దివ్యాంగుల శాతం తగ్గింపుపై వారంతతా ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న పర్సంటేజీనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తుల డేవిడ్ రాజు మాట్లాడుతూ 2010లో జారీ చేసిన సదరం సర్టిఫికెట్లలో ఉన్న పర్సంటేజీని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ పర్సంటేజీ తగ్గించడం వల్ల పింఛన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దు



దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దు. ఎంతో మంది పింఛన్ల మీద ఆధారపడి బతుకుతున్నారు. సదరం సర్టిఫికెట్లలో ఉన్న శాతాన్ని కూడా తగ్గించకూడదు. నోటీసులను వెనక్కి తీసుకోవాలి. నాకు 80 శాతం అంగవైకల్యం.. దివ్యాంగ పింఛన్‌తో జీవిస్తున్నాం. అంగవైకల్యం శాతం తగ్గించి పింఛన్ రాకుండా చేస్తే కుటుంబమంతా రోడ్డున పడతాం. – ఎస్.మల్లేశ్వరి, కంచరపాలెం

యూరియా కట్టకట

- ఎరువుల కోసం రోడ్డెక్కిన రైతులు
- పైరుకు ప్రాణం పోసేదెలా? అంటూ ఆవేదన
- అన్నదాతలతో ఆటలాడుకుంటున్న కూటమి
- నేడు భీమిలిలో వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు

ఈ సమయంలో పొలాల గట్లపై నుంచి పచ్చని పైరును చూస్తూ ఆనందపడాల్సిన రైతన్న.. పంటను కాపాడుకోవడానికి అవసరమైన ఎరువుల కోసం రోడ్డెక్కాడు. యూరియా కోసం తిండితిప్పలు మానేసి.. ఎండనకా వాననకా పడిగాపులు కాస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ చూడని దుస్థితిని ఎదుర్కొంటున్న రైతుకు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విషమ పరీక్ష పెడుతోంది. 'పంటలు ఉంటే ఏంటి.. పోతే ఏంటి.. వీలు నప్పుడే యూరియా ఇస్తాం' అన్నట్లుగా సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే.. ఏం చేయాలో పాలుపోక రోజూ రైతులు ఎదురుచూపు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుకు అండగా భీమిలిలో మంగళవారం వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు' చేపడుతోంది.



రెడ్డిపల్లి ప్రైవేటు ఎరువుల షాపు వద్ద ఎరువుల కోసం వేచి ఉన్న రైతులు



సంగివలసలోని యూరియా అవసరమైన వరి పైరు

సాక్షి, విశాఖపట్నం/పద్మనాభం/సబ్బవరం/తగరపువలస : వర్షాలు పడిన తర్వాత పదును మీదే యూరియా చల్లితేనే పంట ఏపుగా పెరుగుతుంది. కానీ అన్నదాతకు యూరియా అందడం లేదు. జిల్లాలోని భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి వంటి గ్రామీణ ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ రైతులను మోసం చేస్తోంది. జిల్లాలో యూరియా, డీఏపీ అవసరాన్ని అంచనా వేసి వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినా.. ప్రభుత్వం దాన్ని పెడచెవిన పెట్టింది. ఫలితంగా నెల రోజులుగా సహకార సంఘాల వద్దకు కాళ్లరిగేలా తిరుగుతున్నా రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందడం లేదు.

అరకొరగా సరఫరా

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 11,799 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవుతాయి. కానీ ఈ ఏడాది కేవలం 10,200 హెక్టార్లలోనే సాగవుతున్నాయి. ఇందులో 3,777 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 6,423 హెక్టార్లలో ఉద్యాన పంటలు ఉన్నాయి. సెప్టెంబర్ వరకు వివిధ పంటలకు 3,354 టన్నుల ఎరువులు అవసరం. ఇందులో యూరియా 1,875 టన్నులు, డీఏపీ 690 టన్నులు, పొటాష్ 125 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 575 టన్నులు, ఇతర ఎరువులు 90 టన్నులు అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయినా ప్రభుత్వం అరకొరగా ఎరువులు సరఫరా చేసి చేతులు దులుపుకుంది. ఇప్పటివరకు జిల్లాకు కేవలం 1,557 టన్నుల యూరియా మాత్రమే అందింది. మిగిలిన ఎరువుల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు.

పక్కదారి పడుతున్న యూరియా

ఈఏడాది ఆలస్యంగా నాట్లు వేసిన రైతులు యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల వెంట పరుగులు తీస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు యూరియా సరఫరా చేసే బాధ్యతను వదులుకున్నాయి. దీంతో ప్రైవేట్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయించడంతో పాటు పక్క జిల్లాలకు తరలించారు. స్థానిక రైతులు అడిగితే గుళికలు కొనాలని మెలిక పెట్టి ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ క్రాప్ నమోదు ప్రకారం ఎంత పంట వేస్తే అందుకు సరిపడా యూరియా ఇవ్వకుండా ఆధార్ కార్డుకు ఒక బస్తా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఆధార్ కార్డులను సేకరించిన కొందరు కూటమి నాయకులు ఇదే అదనుగా భావించి యూరియాను పక్కదారి పట్టిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం ఇవ్వలేదు.. ఇక్కడా లేదు!



ఎకరన్నర పొలంలో వరిపంట వేశాను. కొన్ని రోజుల నుంచి యూరియా కోసం తిరిగి తిరిగి చెప్పులరిగిపోతున్నాయి. ఒక్క బస్తా కూడా దొరకడం లేదు. ఇప్పటికే ఆలస్యమైపోయింది. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.
– ఆర్.అప్పలరాజు, రైతు, పద్మనాభం మండలం

బోనిలో యూరియా లేదు



నేను 70 సెంట్లలో వరి పంట వేశాను. ఇప్పటి వరకు యూరియా తీసుకోలేదు. మా బోని గ్రామంలో యూరియా దొరకకపోవడంతో వేములవలస వచ్చాను.
– గంట్రెడ్డి సంతోష్, బోని, ఆనందపురం

మా జిల్లాలో దొరకడం లేదని...



మాది విజయనగరం జిల్లా జామి మండలం భీమసింగి గ్రామం. ఐదు ఎకరాల్లో పంట వేశాను. మా ఊరి ఆర్‌బీకేలో ఎప్పుడడిగినా యూరియా లేదు. వస్తాదనే చెబుతున్నారు. ఇక్కడికి వస్తే వేరే జిల్లాల వారికి ఎరువులు ఇవ్వమని చెబుతున్నారు.
– జి.పైడిరాజు, రైతు, భీమసింగి, విజయనగరం జిల్లా

ఏమి చేయాలో..



ఈ సారి 60 సెంట్లలో వరి సాగుచేశాను. ప్రస్తుతం కలుపు తీయాల్సి ఉండటంతో యూరియా వేయాలి. రైతు సేవా కేంద్రంలో యూరియా లేకపోవడంతో రెండు సార్లు సబ్బవరంలోని ఆగ్రో ఏజెన్సీ షాపులకు వెళ్లాను. అక్కడా లేదన్నారు. ఏమి చేయాలో తెలియడంలేదు.
– సింగంపల్లి అమ్మతల్లినాయుడు, రాయపుర అగ్రహారం, సబ్బవరం మండలం

ప్రైవేట్ దుకాణంలో కొన్నాను



శిర్లపాలెంలో యూరియా దొరకడం లేదు. 50 సెంట్లలో వరి వేశాను. గొట్టిపల్లిలో అడిగితే స్టాక్ రావలసి ఉందన్నారు. దీంతో ప్రైవేట్ దుకాణంలో కొన్నాను.
– శిర్ల పైడిశెట్టి, శిర్లపాలెం, ఆనందపురం

టౌన్‌ప్లానింగ్ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం

- అధికారులు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంపై మండిపాటు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పట్ల స్పందించే తీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశంలో, గత వారంలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను సమీక్షించి ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించడం కాకుండా వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పోలీసు శాఖ, జీవీఎంసీ, పట్టణ ప్రణాళికా విభాగాల పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా సమాధానాలు రాసిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ తరహా నిర్లక్ష్యం పునరావృతమైతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. తన సహనాన్ని పరీక్షించవద్దన్నారు.

315 వినతుల స్వీకరణ : పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి మొత్తం 315 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూకు 119, జీవీఎంసీకి 85, పోలీసు శాఖకు 21, ఇతర శాఖలకు 90 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి



నిరసన ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

బీచ్‌రోడ్డు: ఉచిత బస్సు రవాణ సౌకర్యం వల్ల తీవ్రంగా నష్టపోయామని.. తమకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ఆటో డ్రైవర్లు నిరసన చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన వాహన మిత్రం పథకాన్ని కొనసాగిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం తక్షణమే పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా చేయాలన్నారు. డ్రైవర్లకు ఉరితాడు వంటి మోటారు సవరణ చట్టాన్ని, జీవో నెం 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి



తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలోని బొడ్డపాలెంలో ఒడిశాకు చెందిన 13 ఏళ్ల బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె ఉరి వేసుకుని మృతి చెందినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశాలోని రాయగడకు చెందిన ఈ బాలిక రెండు నెలల క్రితం బొడ్డపాలెంలోని ఎవర్‌గ్రీన్ ప్లైవుడ్ ఫ్యాక్టరీలో పని కోసం వచ్చింది. మైనర్ కావడంతో ఫ్యాక్టరీ యాజమాన్యం ఆమెను పనిలో పెట్టుకోలేదు. ఆదివారం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ గుడ్ల భూలోకరెడ్డి తన కుటుంబం కోసమని శోభన్‌కు చెందిన ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. అయితే తాళం వేయకుండా బాలికను ఆ ఇంట్లోనే ఉంచాడు. సోమవారం ఉదయం భూలోకరెడ్డి వచ్చి చూడగా..తలుపు లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో తలుపు పగలుగొట్టి లోపలికి వెళ్లాడు. బాలిక చున్నీతో సీలింగ్‌కు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారమందించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

అంతుచిక్కని మిస్టరీ

రెండు నెలల క్రితం వచ్చిన బాలిక ఇంతకాలం ఎక్కడ ఉంది. ఏం చేస్తోంది.. వంటి వివరాలు అంతుచిక్కడం లేదు. ఈ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులతో బాలిక చనువుగా ఉండేదని, వీరి మధ్య ఏమైనా గొడవ జరిగిందా? అసలు భూలోకరెడ్డికి ఈ బాలికకు సంబంధం ఏంటి? తను అద్దెకు తీసుకున్న ఇంట్లో బాలికను ఎందుకు ఉంచాడు? వంటి వివరాలు అంతుచిక్కడం లేదు. సంఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 105 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 105 వినతులు అందాయి. జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యధికంగా 57 పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించినవి కాగా, రెవెన్యూ విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగానికి 14, ప్రజారోగ్య విభాగానికి 8, యూసీడీకి 8, అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 4 వినతులు అందాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవరెడ్డి, ఫైనాన్షియల్ అడ్వైజర్ మల్లికాంబ పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికుల ఆందోళన ఉధృతం

అగనంపూడి : జీతాల బకాయిలు చెల్లించాలని నాలుగు రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా యాజమాన్యంలో స్పందన లేకపోవడంతో కార్మికులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. దువ్వాడ వీఎస్ ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్‌లో అల్లాయ్ వీల్స్ తయారు చేసి, ఎగుమతులు చేస్తుండడంతోపాటు దేశీయ మార్కెట్‌లో కూడా విక్రయాలు చేస్తుంది. అయితే సంస్థ గత కొన్నేళ్లుగా ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పి కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించకుండా తాత్సారం చేస్తూ వస్తోంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు కేవలం ఆరు మాసాల జీతాలు మాత్రమే చెల్లించారని, మిగిలిన ఆరు మాసాల జీతాలు చెల్లించాలని విన్నవించుకున్నా పట్టించుకోపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనకు దిగామని కార్మికుల ప్రతినిధులు దాస్, ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా యాజమాన్యం కనీసం చర్చలకు కూడా పిలవకపోవడం, సోమవారం పోలీస్ బలగాలను దించడంతో కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా గేటు వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. గత కొన్నేళ్లుగా ఇంక్రిమెంట్లు, బోనస్‌లు లేవని అయినా సంస్థ పరిస్థితిని గమనించి మేం సర్దుకుపోతున్నా యాజమాన్యం జీతాలు కూడా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీతాల నుంచి కోత విధిస్తున్న డబ్బులను పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో జమ చేయడం లేదని, దీంతో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఆరోపించారు. ఆందోళనలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జీతాల బకాయిలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న దువ్వాడ వీఎస్ఈజెడ్ కార్మికులు

కబడ్డీతో కల నెరవేరింది

- నగరంలో సందడి చేసిన తెలుగు టైటాన్స్
- విద్యార్థులతో ముఖాముఖి

'ఒకప్పుడు మట్టి కోర్టుల్లో ఆడిన కబడ్డీ.. నేడు పీకేఎల్ పుణ్యమా అని లక్షల, కోట్ల రూపాయల ఆటగా మారింది. గ్రామీణ క్రీడగా మొదలైన కబడ్డీ, ఇప్పుడు ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేస్తోంది. ఆటగాళ్లకు అనూహ్యమైన గుర్తింపు, ఆదాయం తెచ్చిపెడుతోంది. పీకేఎల్ వేలంలో మన ఆటగాళ్లను కోట్లు పెట్టి కొనుగోలు చేస్తుండటమే దీనికి నిదర్శనం'. విశాఖలో పీకేఎల్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలుగు టైటాన్స్ బృందం విద్యార్థులతో తమ అనుభవాలను, ఎదిగిన తీరును పంచుకుంది. – విశాఖ స్పోర్ట్స్

కబడ్డీ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, అది మన సంస్కృతిని ప్రతిబింబిస్తుందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, పీకేఎల్ టెక్నికల్ డైరెక్టర్ ప్రసాదరావు అన్నారు. ప్రస్తుత ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్‌లో భాగంగా సోమవారం తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు గీతం డీమ్డ్ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, గ్రామీణ ఆటగా మొదలైన కబడ్డీ, పీకేఎల్ కారణంగా ఇప్పుడు ప్రపంచ వేదికపై గొప్ప క్రీడగా ఎదిగిందని తెలిపారు. ఒక సరదా ఔట్‌డోర్ గేమ్ నుంచి సాంకేతికతతో అభివృద్ధి చెంది, ఏసీ ఎరీనాలలో మ్యాచ్‌లు జరిగే స్థాయికి కబడ్డీ చేరుకుందని ఆయన అన్నారు. 18–22 ఏళ్ల యువకుడు కేవలం రెండు నెలల ప్రో కబడ్డీ సీజన్‌కు రూ.2.65 కోట్లు సంపాదిస్తున్నాడంటే, ఈ ఆట ఎంతగా అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. మొదట రూ.20 లక్షల ప్రారంభ ధరతో ఆటగాళ్లను కొనుగోలు చేయగా, ఇప్పుడు కోటి రూపాయల కంటే ఎక్కువ ధర పలికిన ఆటగాళ్లు ఉన్నారని వివరించారు. కబడ్డీ ఆటగా మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం, విద్యార్థులు, యూనివర్సిటీ కబడ్డీ క్లబ్ సభ్యులతో టైటాన్స్ ఆటగాళ్లు ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సీజన్‌లో మొదట తడబడ్డా, ఆటగాళ్ల సమన్వయంతో రాణిస్తున్నామని, ట్రోఫీ సాధించేందుకు అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని వారు తెలిపారు.



తొడగొడుతున్న తెలుగు టైటాన్స్



విద్యార్థులతో సందడి చేస్తున్న తెలుగు టైటాన్స్ క్రీడాకారులు

కుగ్రామం నుంచి ప్రపంచానికి తెలిసేలా..



ఒక చిన్న కుగ్రామం నుంచి వచ్చా.. కబడ్డీ నా జీవితాన్నే మార్చేసింది. ఆట ద్వారా ప్రపంచం మమ్మల్ని గుర్తించడం చాలా ఆనందంగా ఉంది. అంకితభావంతో కృషి చేస్తే ప్రపంచానికి చేరువవడం పెద్ద కష్టం కాదు.

– తెలుగు టైటాన్స్ కెప్టెన్ ఆల్‌రౌండర్ విజయ్‌మలిక్

జీవితమే మారిపోయింది



అతి సామాన్య జీవితం నుంచి నేడు ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరానంటే ప్రో కబడ్డీయే కారణం. మా గ్రామంలో కుర్రాడు టీవీలో కనిపిస్తున్నాడు అక్కడ ప్రజల ఆనందానికి అంతేముంటుంది. అదే నాజీవితంలోనూ జరిగింది. కబడ్డీ నాకు అన్నీ ఇచ్చింది.

– టైటాన్స్ డిఫెండర్ శుభమ్ షిండే

రూ.కోటికి చేరుకున్నా..



జీవితంలో కబడ్డీ కీలకంగా మారింది. మొదట రూ.20 లక్షల ప్రారంభ ధరతో కొనుగోలు చేశారు. ప్రస్తుతం నా ధర రూ.కోటి. ఇంత గుర్తింపు దక్కిందంటే నా ఆటే కారణం. ప్రస్తుత సీజన్‌లో ఆల్‌రౌండర్‌గా..రైడింగ్‌లో రాణిస్తున్నా..రైడ్, టాకిల్‌తో నాలుగు మ్యాచ్‌ల్లో ఇప్పటికే 34పాయింట్లు రాబట్టాను.

– టైటాన్స్ స్టార్ రైడర్ భరత్

అత్తను చంపిన అల్లుడికి జీవిత ఖైదు



విశాఖలీగల్ : అత్తపై దాడి చేసి చంపిన అల్లుడికి జీవిత ఖైదు విధిస్తూ నగరంలో మహిళా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.1.2 లక్షలు జరిమానా చెల్లించాలని, అందులో రూ.లక్ష భార్యకు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసెక్యూటర్ వి.ఖజనారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవలోని లక్ష్మీపార్వతి నగర్‌కి చెందిన వి.మహేష్ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. మహేష్ అదే ప్రాంతానికి చెందిన ఎర్రంశెట్టి కుమారిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. కాలక్రమంలో మహేష్ వ్యసనాలకు బానిసయ్యాడు. తరచూ పూర్తిగా మద్యం తాగి భార్య,పిల్లలను హింసించేవాడు. తాగుడికి డబ్బులు కావాలని భార్యను తీవ్రంగా వేధించేవాడు. భర్త వేధింపులను భరించలేక 2013 అక్టోబర్ 10వ తేదీకి ముందు కుమారి తన ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వచ్చేసింది. నిందితుడు అక్కడకు కూడా వచ్చి మద్యం కోసం డబ్బులు అడిగేవాడు. ఈ నేపథ్యంలో మహేష్‌కు కుమారికి మధ్య ఘర్షణ జరిగింది. తన భార్య దగ్గర వచ్చి తన పిల్లలకు బిస్కెట్లు ఇవ్వడానికి ప్రయత్నం చేశాడు. అందుకు భార్య అత్తమామలు అడ్డు చెప్పారు. అవమానం భరించలేక బయటకు వెళ్లిపోయాడు. మళ్లీ అరగంట వ్యవధిలో ఇనుప రాడ్డుతో వచ్చి విచక్షణారహితంగా అడ్డువచ్చిన భార్య, అత్తమామలను గాయపరిచాడు. వారిని చుట్టుపక్కల వారు కేజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ అత్త లక్ష్మి మృతి చెందింది. భార్య కుమారి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

దొంగతనం కేసులో వ్యక్తికి ఏడాది జైలు

విశాఖ లీగల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఒక నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు, రూ. 6,000 జరిమానా కూడా చెల్లించాలని లేనిపక్షంలో అదనంగా నెల రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు. సీనియర్ ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి..మల్కాపురానికి చెందిన పాట్టి కృష్ణపై ఇప్పటికే 22 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేయడంలో సిద్ధహస్తుడు. చెక్క మురళీకృష్ణ గత ఫిబ్రవరి 14న తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉన్న 22 తులాల బంగారం, ఒక కేజీ వెండి, రూ.లక్ష చోరీకి గురయ్యాయి. బాధితుడు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో దొంగతనానికి పాల్పడిన పాట్టి కృష్ణను అరెస్టు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

మూగబాలిక తల్లిదండ్రులను పరామర్శించిన కేకే రాజు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలో లైంగికదాడికి గురైన మూగ బాలిక కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు పెరగడం వల్ల నేరాలు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాలిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి, దోషులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, రవీంద్ర భరత్ పాల్గొన్నారు.



లైంగికదాడికి గురైన మూగబాలిక తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కేకే రాజు, పార్టీ నాయకులు

విజువల్ వండర్ మిరాయ్

ప్రీ రిలీజ్ ఈవెంట్లో చిత్ర యూనిట్

ఏయూక్యాంపస్ : సూపర్ హీరో తేజ సజ్జా నటించిన విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఈ సందర్భంగా మేకర్స్ నగరంలో గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ సెప్టెంబర్ 12 మిరాయ్ థియేటర్లోకి వస్తుంది. ఇది ఒక యాక్షన్ ఫాంటసీ అడ్వెంచర్. తప్పకుండా అందరూ థియేటర్స్ కి వచ్చి చూడండని కోరాడు. అలాగే మంచు మనోజ్, హీరోయిన్ రితిక నాయక్ మాట్లాడుతూ సినిమా ఆదరించాలని కోరారు.

జీవీఎంసీ అధ్యయన యాత్రకు దూరం

డాబాగార్డెన్స్: ఈ నెల 15 నుంచి 23 వరకు రాజస్థాన్, ఢిల్లీలలో జీవీఎంసీ చేపట్టనున్న అధ్యయన యాత్రలో తాను పాల్గొనడం లేదని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు ప్రకటించారు. ఈ మేరకు ఆయన నగర మేయర్‌కు లేఖ పంపారు. ఈ తరహా అధ్యయన యాత్రల వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఇది ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని గంగారావు ఆరోపించారు. గతంలో చేసిన అధ్యయన యాత్రల నివేదికలపై ఇప్పటివరకు కౌన్సిల్‌లో చర్చ జరపలేదని, ప్రజలపై పన్నుల భారం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి యాత్రలు చేయడం సరికాదని ఆయన అన్నారు.

నేడు చాగంటికి 'కొప్పరపు' పురస్కారం

మద్దిలపాలెం : ప్రసిద్ధ ప్రవచనకారులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 2025వ సంవత్సరపు ప్రతిష్టాత్మకమైన కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. మాచవరం వేంకట చెంచు రామ మారుతి సుబ్బరాయ శర్మ (మా శర్మ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించే ఈ సభకు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, అమెరికాకు చెందిన లిపి సంస్థ సీఈవో సాగర్ అనిసింగరాజు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

టికెట్ తనిఖీ సిబ్బందికి బయోమెట్రిక్ సిస్టం

తాటిచెట్లపాలెం : టికెట్ తనిఖీ సిబ్బందికి తొలిసారిగా బయోమెట్రిక్ పద్ధతిని వాల్తేర్ డివిజన్‌లో పరిచయం చేసింది. విశాఖలో గల ట్రైన్ టికెట్ ఎగ్జామినర్స్‌కు మొదటిగా అందుబాటులోకి తీసుకువచ్చారు. క్రమక్రమంగా మిగిలిన అన్ని ప్రాంతాల్లో కూడా దీనిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.